ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 254 | పేజీలు: 4 | వెల: రూ.3/- శుక్రవారం 20 డిసెంబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

## ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో
# ఏ1గా కేటీఆర్
### 55 కోట్ల అవినీతిపై ఎసిబి కేసు నమోదు




**హైదరాబాద్, డిసెంబర్ 19 (ప్రభాత ఉదయం):** ఎట్టకేలకు కేటీఆర్ మెడకు ఈ కార్ రేసింగ్ అవినీతి ఉచ్చు బిగుసుకుంటోంది. దీనిపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేసిన కేటీఆర్‌పై కేసు నమోదు అయ్యింది. ఫార్ములా-ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై కేసు నమోదైంది. ఏ1గా కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అర్వింద్‌కుమార్, ఏ3గా హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్‌ఎన్ రెడ్డిపై తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసింది. ఫార్ములా-ఈ కార్ రేసు వ్యవహారంలో పురపాలక శాఖ మాజీ మంత్రి కేటీఆర్‌పై విచారణ జరిపేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతి ఇవ్వడంతో తదుపరి చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. అందులో భాగంగా ఈ వ్యవహారంపై విచారణ చేపట్టాల్సిందిగా అవినీతి నిరోధక శాఖ(అనిశా)కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) శాంతికుమారి మంగళవారం లేఖ రాశారు. ఫార్ములా రేసు పూర్వాపరాలు, అనుమతి లేకుండానే హెచ్‌ఎండీఏ ఒప్పందం చేసుకోవడం, ఆర్‌బీఐ అనుమతి లేకుండా రూ.46 కోట్ల మేర విదేశీ కరెన్సీ చెల్లించడం వంటి వ్యవహారాలపై పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఫిర్యాదు మేరకు ఏసీబీ ఇప్పటికే కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇందులో కేటీఆర్‌తోపాటు పురపాలకశాఖ అప్పటి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్‌ను, చీఫ్ ఇంజినీర్‌ను బాధ్యులుగా పేర్కొన్నారు. అధికారులపై విచారణకు ప్రభుత్వం ఇంతకుముందే అనుమతి ఇచ్చింది. కేటీఆర్‌పై కేసు నమోదుకు గవర్నర్ నుంచి అనుమతి ..మిగతా 2లో

## ఈ రేస్ వ్యవహారంపై శాసనసభలో చర్చ పెట్టాలి

ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నిరూపించుకోవాలి..
ప్రజలకు వాస్తవాలు తెలియాలంటే చర్చ జరపండి..
చర్చ జరిగితే అన్ని విషయాలు క్షుణ్ణంగా వివరిస్తా
ఏసీబీ కేసు నమోదుపై కేటీఆర్ స్పందన.. విచారణ పేరిట ప్రభుత్వం అక్రమ కేసులు
రాష్ట్ర ఇమేజ్ కోసం ప్రయత్నిస్తే అక్రమ కేసులు..
ప్రభుత్వంపై హరీష్ రావు ఆగ్రహం

2



## పార్లమెంట్ వద్ద
# గందరగోళం

### పరస్పర ఆందోళనలకు దిగిన కాంగ్రెస్, బిజెపి పక్షాలు..
### తోపులాటలో ఇద్దరు బిజెపి ఎంపిలకు గాయాలు
### ఇద్దరినీ చికిత్స కోసం అస్పత్రికి తరలింపు..
### తమను కావాలనే అడ్డుకున్నారని రాహుల్ ఎదురుదాడి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 19 (ప్రభాత ఉదయం):** పార్లమెంట్ ప్రాంగణంలో గురువారం గందరగోళ వాతావరణం నెలకొంది. పరస్పర తోపులాటల్లో బిజెపి ఎంపిలు ఇద్దరికి గాయాలయ్యాయి. ఆయనను హుటాహుటిని ఆస్పత్రికి తరలించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. అటు అంబేద్కర్‌ను కాంగ్రెస్ అవమానించిందని ఆరోపిస్తూ అధికార పక్షం కూడా నిరసన చేపట్టారు. ఇరు వర్గాల ఆందోళనలతో పార్లమెంట్ ప్రాంగణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇందులో భాజపాకు చెందిన ఇద్దరు ఎంపీలు తీవ్రంగా గాయపడ్డారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తోయడం వల్లే వీరు గాయపడ్డారని భాజపా ఆరోపిస్తోంది. పార్లమెంట్‌లోని మకరద్వారం వద్ద ఉన్న గోడ ఎక్కి ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపీలు ప్లకార్డులు చూపిస్తూ ఆందోళన చేపట్టారు. అదే సమయంలో అక్కడకు ఎన్డీయే కూటమి ఎంపీలు వచ్చారు. వీరిని లోపలికి వెళ్లకుండా విపక్ష నేతలు అడ్డుకున్నారని భాజపా ఆరోపించింది. ఈ క్రమంలోనే కొంత గందరగోళం చోటుచేసుకుని భాజపా ఎంపీలు ముకేశ్ రాజ్‌పుత్, ప్రతాప్ చంద్ర సారంగి కిందపడి గాయపడ్డారు. వీరిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం ఎంపీ ముకేశ్ రాజ్‌పుత్‌కు ఐసీయూలో చికిత్స అందించారు. మరో ఎంపీ ప్రతాప్ చంద్ర సారంగి తలకు గాయమైంది. వీరి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు స్పందించారు. 'ఇద్దరు ఎంపీల తలలకు దెబ్బలు తగిలాయి. సారంగి తలకు లోతైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. తలకు కుట్లు వేశాం. ముకేశ్ రాజ్‌పుత్ స్పృహ కోల్పోయిన స్థితిలో వచ్చారు. వైద్యం అందించాక ఆయన కోలుకుని స్పృహలోకి వచ్చారు' అని వైద్యులు వెల్లడించారు. వీరిని ..మిగతా 2లో




## క్యాన్సర్ వ్యాక్సిన్ అభివృద్ధి చేసిన రష్యా
### ఫ్రీగా పంపిణీ చేయాలని నిర్ణయం!
### జనవరిలో రష్యన్ మార్కెట్‌లో అందుబాటులోకి

**గామాలియా, డిసెంబర్ 19 (ప్రభాత ఉదయం):** క్యాన్సర్ కేసులు ఇప్పుడు ప్రతి చోటా నమోదవుతున్నాయి. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన చికిత్స అందిస్తేనే ప్రమాదం నుంచి తప్పించు కోవచ్చు. అయితే ఇప్పుడు రష్యా క్యాన్సర్ కోసం ప్రత్యేక వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసింది. ఎంఆర్‌ఎంఏ ఆధారితంగా రూపొందించిన వ్యాక్సిన్ క్యాన్సర్‌తో పోరాడుతుందని రష్యా చెబుతోంది. విశేషమేమిటంటే ఈ వ్యాక్సిన్‌ను ఉచితంగా ఇస్తామని రష్యా ప్రకటించింది. రష్యా అభివృద్ధి చేసిన ఎంఆర్‌ఎంఏ ఆధారిత క్యాన్సర్ వ్యాక్సిన్ 2025 ప్రారంభంలో ..మిగతా 2లో

## కాంగ్రెస్ వల్ల క్వశ్చన్ అవర్
# అర్ధమే మారిపోయింది
### మంత్రులే ప్రశ్నలు అడిగి ప్రశ్నోత్తరాల అర్థాన్ని మార్చుతున్నారు
### కొత్త సంస్కృతిని తీసుకరావొద్దు: హరీశ్‌రావు



**హైదరాబాద్, డిసెంబర్ 19 (ప్రభాత ఉదయం):** కేబినెట్ నిర్ణయం అంటే సమిష్టి నిర్ణయమని, క్వశ్చన్ అవర్‌లో ఒక మంత్రి మరొక మంత్రిని ప్రశ్న అడగడం ఏంటని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. మంత్రులే ప్రశ్నలు అడిగితే ప్రశ్నోత్తరాలకు అర్థమే మారిపోతుందన్నారు. ప్రశ్నోత్తరాల్లో భాగంగా మంత్రి కోమటిరెడ్డి వెం కట్ రెడ్డి నల్లగొండ జిల్లాలోని నీటి సమస్యలను గురించి సంబంధిత మంత్రిని ప్రశ్నించారు. దీనిపట్ల హరీశ్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రశ్నోత్తరాల్లో మంత్రి కోమటిరెడ్డి మాట్లాడటం ఏంటని, ఒక మంత్రి మరో మంత్రిని ప్రశ్నించడం ఏంటన్నారు. కొత్త సంస్కృతిని సభలో తీసుకురావద్దని స్పీకర్‌ను కోరారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో కోమటిరెడ్డి మంత్రిగా ఉన్నారని, వారి హయాంలోనే మూసీ మురికి కూపంగా మారిందన్నారు. అప్పుడు వారు సరిగ్గా చేసిఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని చెప్పారు. అయితే ఏ హోదాలో అడుగుతున్నారని హరీశ్‌రావును మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు. ఆయనకు అడిగే హక్కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు మాట్లాడే ..మిగతా 2లో



## భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య కాల్పులు
### ఐదుగురు టెర్రరిస్టులు హతం

శ్రీనగర్, డిసెంబర్ 19 (ప్రభాత ఉదయం): జమ్ము కశ్మీర్‌లోని కుల్గామ్‌లో భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు టెర్రరిస్టులు హతమయ్యారు. కుల్గామ్ జిల్లాలోని బెహిబాగ్ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నట్లు సమాచారం అందడంతో స్థానిక పోలీసులతో కలిసి భద్రతా దళాలు తనిఖీలు నిర్వహించాయి. ఈ క్రమంలో ముష్కరులు భద్రతా బలగాలపై కాల్పులకు తెగబడ్డారు. ప్రతిగా జరిపిన కాల్పుల్లో ఐదుగురు ఉగ్రవాదులు చనిపోయారని ఇండియన్ ఆర్మీకి చెందిన చినార్ కార్ప్స్ ఎక్స్ వేదికగా వెల్లడించింది. టెర్రరిస్టుల కాల్పుల్లో ఇద్దరు భద్రతా సిబ్బంది గాయపడినట్లు తెలిపింది. ఆ ప్రాంతంలో గాలింపు కొనసాగుతున్నదని పేర్కొంది. మృతులను ఇంకా గుర్తించాల్సి ఉందని వెల్లడించింది. కాగా, ఈ నెల ఆరంభంలో శ్రీనగర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ ఉగ్రవాది చనిపోయాడు. అతడు గగన్‌గిర్, గందేర్బల్ ప్రాంతాల్లో సాధారణ పౌరులను హత్యలతోపాటు పలు ఉగ్రదాడుల్లో పాల్గొన్నాడని అధికారులు వెల్లడించారు.



## పార్లమెంట్ వద్ద

# గందరగోళం

మొదటి పేజీ తరువాయి...

పలువురు కేంద్రమంత్రులు, తెదేపా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ప్రధాని మోదీ ఫోన్లో పరామర్శించారు. వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి తీసుకెళ్లే సమయంలో ఎంపీ ప్రతాప్ సారంగి మీడియాతో మాట్లాడుతూ.. 'నేను మెట్ల వద్ద నిల్చొని ఉండగా.. రాహుల్ గాంధీ ఓ ఎంపీని నెట్టేశారు. ఆయన వచ్చి నాపై పడటంతో నేను కిందపడ్డాను' అని ఆరోపించారు. ఈ ఘటన నేపథ్యంలో రాహుల్ గాంధీపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని భాజపా యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. 'జరిగిందంతా మీ కెమెరాల్లో కనబడి ఉండొచ్చు. నేను పార్లమెంట్ లోపలికి వెళ్తుండగా భాజపా ఎంపీలు నన్ను అడ్డుకొనే ప్రయత్నం చేశారు. తోసేశారు. బెదిరించారు. మల్లికార్జున్ ఖర్గేను కూడా నెట్టేశారు. మాకు లోపలికి వెళ్లే హక్కు ఉంది. కానీ, వారు అడ్డుకుంటున్నారు. ఇక్కడ ప్రధాన సమస్య ఏంటంటే.. రాజ్యాంగంపై వారు దాడి చేస్తున్నారు. అంబేద్కర్‌ను అవమానించారు' అని రాహుల్ దుయ్యబట్టారు. భాజపా ఎంపీలే తమను అడ్డుకున్నారని ఆరోపిస్తూ అందుకు సంబంధించిన వీడియోను కాంగెస్ 'ఎక్స్'లో షేర్ చేసింది. అంతేగాక, ప్రస్తుత వ్యవహారంపై స్పీకర్ ఓం బిర్లాకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ రాశారు. 'ఆందోళన సమయంలో భాజపా ఎంపీలు నన్ను నెట్టేశారు. దాంతో నా మోకాలికి గాయమైంది' అని తెలిపారు. తోపులాట ఘటనపై విచారణ జరపాలని లేఖలో పేర్కొన్నారు. ఈ పరిణామాల వేళ పార్లమెంట్ ఉభయ సభలు మధ్యాహ్నానికి వాయిదా పడ్డాయి.

## కాంగ్రెస్ వల్ల క్వశ్చన్ అవర్

# అర్థమే మారిపోయింది

మొదటి పేజీ తరువాయి...

అవకాశం ఇవ్వొద్దని స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు సూచించారు. అనంతరం హరీశ్ మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అతిఎక్కువ పాలించింది కాంగ్రెస్ పార్టీ. నేడు మూసీ వల్ల నల్లగొండ జిల్లా ప్రజలు బాధపడుతున్నారంటే దానికి ప్రధాన ముద్దాయి కాంగ్రెస్ పార్టీయే నన్నారు. ఎస్ఆర్ఎస్పీ స్టేజ్ 2 పనులు పూర్తిచేసి కాళేశ్వరం జలాలను నల్లగొండ జిల్లా, సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ ప్రజలకు అందించేదే బీఆర్ఎస్ పార్టీ అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందే, తాము ఏం చేశామో చర్చ పెట్టాలన్నారు. ప్రశ్నోత్తరాల్లో ప్రశ్నకు సూటిగా జవాబు వచ్చినట్లయితే పది ప్రశ్నలకు ఆన్సర్ వచ్చే అవకాశం ఉ ందన్నారు. ప్రతిరోజు మూడు నాలుగు ప్రశ్నలకే సభాసమయం సరిపోతుందని, ఒక్కో ప్రశ్నకు సూటిగా సమాధానం వచ్చేలా చూడాలన్నారు. మంత్రులు లేచి రాజకీయ ప్రసంగాలు చేస్తే తాము కల్పించుకోవాల్సి వస్తుందన్నారు. అలాంటి వాటికి మరోసారి అవకాశం ఇవ్వొద్దని స్పీకర్‌ను కోరారు.

## మార్చి 21 నుంచి

# పదో తరగతి పరీక్షలు

**హైదరాబాద్, డిసెంబర్ 19 (ప్రభాత ఉదయం):** తెలంగాణ పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించి కీలక ప్రకటన వెలువడింది. 2025, మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలను నిర్వహించనున్నట్లు ఎస్సెస్సీ బోర్డు ప్రకటించింది. పదో తరగతి పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరగనున్నాయి. ఇక ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ పరీక్షలను ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నారు.

పది పరీక్షల టైం టేబుల్ ఇదే..

మార్చి 21(శుక్రవారం) ఫస్ట్ లాంగ్వేజ్
మార్చి 22(శనివారం) సెకండ్ లాంగ్వేజ్
మార్చి 24(సోమవారం) థర్డ్ లాంగ్వేజ్(ఇంగ్లీష్)
మార్చి 26(బుధవారం) గణితం
మార్చి 28(శుక్రవారం) సైన్స్(ఫిజికల్ సైన్స్)
మార్చి 29(శనివారం) సైన్స్(బయోలాజికల్ సైన్స్)
ఏప్రిల్ 2(బుధవారం) సోషల్ స్టడీస్
ఏప్రిల్ 3(గురువారం) ఓఎస్ఎస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్ -1
ఏప్రిల్ 4(శుక్రవారం) ఓఎస్ఎస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్ -2

## ఫెడ్ దెబ్బకు భారీగా

# పడిపోయిన రూపాయి

### డాలర్‌తో పోలిస్తే 85కు చేరిన విలువ

### దిగుమతులు, విద్యార్థులపై తీవ్ర ప్రభావం

**ముంబయి, డిసెంబర్ 19 (ప్రభాత ఉదయం):** మరోమారు రూపాయి విలువ దారుణంవగా పడిపోయింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే 85కు చేరుకుంది. ఇంతగా పతనం కావడం ఇదే మొదటిసారి. దీంతో దిగుమతులు, విదేశాలకు వెళ్లే విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడనుంది. మన దేశ కరెన్సీ రూపాయి విలువ భారీగా క్షీణించింది. అమెరికా డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 85 స్థాయిని దాటింది. ఈ మార్కును దాటడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గించినప్పటికీ.. 2025లో వడ్డీ రేట్ల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తామని పేర్కొనడం మన రూపాయితో పాటు, వర్ధమాన దేశాల కరెన్సీలపై ఒత్తిడి పెంచింది. ఈక్రమంలోనే బుధవారం నాటికి 84.94గా ఉన్న రూపాయి మారకం విలువ గురువారం ఉదయం 85.06 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయికి చేరింది. భౌగోళిక రాజకీయ పరిణామాలు, దేశీయ పరిణామాల కారణంగా గత కొంతకాలంగా రూపాయి ఒత్తిడిని ఎదుర్కొంటోంది. దేశీయంగా వృద్ధి నెమ్మదించడం, వాణిజ్య లోటు పెరగడం, దేశీయంగా పెట్టుబడులు సన్నగిల్లడం వంటి కారణాలతో రూపాయి విలువ క్షీణించింది. అదే సమయంలో అమెరికా డాలరు మరింత బలపడడం, అక్కడ బాండ్ రాబడులు పెరగడం కూడా మరో కారణం. తాజాగా వడ్డీ రేట్ల కోత విషయంలో దూకుడు ఉండకపోవచ్చన్న ఫెడ్ చీఫ్ జెరోమ్ పావెల్ వ్యాఖ్యలు రూపాయి విలువ పతనానికి దారితీసింది. రూపాయితో పాటు కొరియన్ వోన్, మలేసియన్ రింగిట్స్, ఇండోనేషియా రూపాయి విలువలు కూడా స్వల్పంగా పతనమయ్యాయి. రూపాయి విలువ పతనమైతే ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులపై భారం పడుతుంది. ఇక్కడినుంచి నగదును డాలర్లలోకి మారిస్తే.. మరిన్ని ఎక్కువ రూపాయలు వెచ్చించాల్సి ఉంటుంది. మనం దిగుమతి చేసుకునే చమురుకు కూడా డాలర్లలోనే చెల్లింపులు చేస్తుంటాం. దీనివల్ల ఖజానాపై భారం పడుతుంది. అయితే, దేశీయ ఐటీ, ఫార్మా కంపెనీలు తమ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేస్తుంటాయి. వాటికి డాలర్లలో చెల్లింపులు జరుగుతుంటాయి. తద్వారా రూపాయి విలువ పతనంతో ఆ కంపెనీలకు లాభం చేకూరుతుంది.

## భీమిలి మున్సిపాలిటీ


# దేశంలోనే రెండవ మున్సిపాలిటీ



1861 లో భీముని పట్నం (భీమిలి) లో భారత దేశంలో ఏర్పాటు చేసిన రెండవ మున్సిపాలిటీ




నూతనంగా నిర్మించిన భీమునిపట్నం మున్సిపాలిటీ కార్యాలయం



జోనల్ కమిషనర్ పి. ప్రసన్న వాణి



భీమిలిలో 18వ శతాబ్దంలో నిర్మించిన సెయింట్ పీటర్ చర్చ్

### ఆంగ్లేయుల పాలనలో ఇక్కడ మున్సిపాలిటీ
### దేశంలో మొదటి మున్సిపాలిటీ గుజరాత్‌లోని సూరత్
### నేడు పర్యాటకులను ఆహ్లాద పరుస్తున్న భీమిలి బీచ్

**భీమిలి/ హైదరాబాద్, డిసెంబరు19(ప్రభాత ఉదయం):** భీమిలి దేశంలోనే రెండవ మున్సిపాలిటీ. మొదటి మున్సిపాలిటీ గుజరాత్ లోని సూరత్ కాగా బ్రిటిషర్ల పాలన లో భీమిలిని రెండవ మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. నేడు భీమిలి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లాలో ఉంది. విశాఖపట్నం కు 28 కిలోమీటర్ల దూరంలో ఉన్న భీముని పట్టణంలో మొట్టమొదటగా పోర్టు కూడా బ్రిటిషర్లు ఏర్పాటు చేశారు. దేశంలో ఉన్న 11 పోర్ట్ లలో ఇది రెండవ పోర్టుగా చెప్పుకోవచ్చు . అయితే దాన్ని ప్రస్తుతం విశాఖపట్నం కు మార్చారు. ఈస్ట్ ఇండియా కంపెనీ వ్యాపార నిమిత్తం భారతదేశానికి వచ్చినప్పుడు వారు బీములిని ఎన్నుకున్నట్లు సమాచారం. ఈస్టిండియా కంపెనీ నిర్మించిన 18వ శతాబ్దపు నాటి సెయింట్ పీటర్ చర్చ్ నేటికీ చెక్కుచెదరకుండా ఉంది. ఆనాడు ఇక్కడ వ్యాపారం చేసిన డచ్ సమాజానికి చెందిన సమాధులు వారి భవనాలు కూడా ఇక్కడ కనిపిస్తాయి.

**సముద్ర కన్యలు, సహజంగా**

**సముద్రపు ఒడ్డున ఏర్పడిన ఆర్చ్ ఇక్కడ ప్రత్యేకత:**

భీమిలిలో సముద్రపు ఒడ్డున సాగర కన్యలు (చేప) ఆకారంలో ఉన్న శిల్పాలు ఇక్కడ ప్రత్యేకత. డచ్ కాలంలో నిర్మించిన చేప ఆకారపు శిల్పాలు ఇటీవల సంభవించిన హుదూత్ తుఫాన్ లో ధ్వంసం కాగా కొత్తగా సాగర కన్యల శిల్పాన్ని ఏర్పాటు చేశారు . సముద్రపు ఒడ్డున ఉన్న రాళ్లు ఒక ఆర్చ్ రూపంగా సహజ సిద్ధ రీతిలో ఏర్పడడం ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది.

**పర్యాటకులకు అనుకూలంగా అభివృద్ధి చేస్తున్నాం:**

**జోనల్ కమిషనర్ పి ప్రసన్న వాణి**

భీమిలి బీచ్‌లో పర్యాటకులకు ఆహ్లాదపరచడానికి కావలసిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. మన భీమిలి, ఐ లవ్ యూ భీమిలి అనే ఆర్చులను నిర్మించాము. బోటు షికారు కూడా ఉంది. ఇక్కడి ప్రజలకు కావలసిన సౌకర్యాలను కల్పిస్తూనే, పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.



### భీమిలి బాగుంది

### మేకల దామోదర్ రెడ్డి

దేశంలోనే రెండవ మున్సిపాలిటీగా 163 సంవత్సరాల క్రితం ఏర్పాటు అయిన భీమునిపట్నం ( భీమిలి) ని చూడడం సంతోషంగా ఉంది . భీమిలి బీచ్ చాలా అభివృద్ధి చెందింది భీమిలిలో మంచి మంచి పాఠశాలలు ఉన్నాయి. ఆనాటి భవనాలు ఇంకా చెక్కుచెదరకుండా పటిష్టంగా ఉన్నాయి.

## క్యాన్సర్ వ్యాక్సిన్ అభివృద్ధి చేసిన రష్యా

మొదటి పేజీ తరువాయి...

విడుదల కానుంది. క్యాన్సర్ వ్యాక్సిన్ విడుదలైన వెంటనే రష్యన్ మార్కెట్‌లో అందుబాటులో ఉంటుంది. రష్యాలోని రేడియల్ మెడికల్ రీసెర్చ్ సెంటర్, ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ విషయంలో ఒక ముఖ్యమైన ప్రకటనను విడుదల చేసింది. వ్యాక్సిన్ ప్రయోగాత్మక దశలో క్యాన్సర్ కణితుల పెరుగుదలను నియంత్రించిందని తెలిపింది. ఈ వ్యాక్సిన్ క్యాన్సర్‌తో బాధపడు తున్న రోగులలో కణితులను నియంత్రించడంలో, వాటిని క్యాన్సర్ రహితంగా మార్చడంలో సహాయపడిందని గామాలియా నేషనల్ రీసెర్చ్ సెంటర్‌లోని ఎపిడెమియాలజీ, మైక్రోబయాలజీ డైరెక్టర్ అలెగ్జాండర్ గింట్జ్‌బర్గ్ తెలిపారు. అనేక పరిశోధన సంస్థలు సమష్టి కృషితో క్యాన్సర్ వ్యాక్సిన్‌ను రూపొందించినట్టుగా శాస్త్రవేత్తలు ప్రకటించారు. క్లీనికల్ ట్రయల్స్‌లో కణతి పెరుగుదలను అడ్డుకోవడంతో పాటు మెటాస్టాసిస్ అంటే వ్యాధికారక ఏజెంట్‌ను నిరోధించిందని తెలిపారు. ఈ వ్యాక్సిన్ రోగికి క్యాన్సర్‌తో పోరాడే యాంటీబాడీని, రోగనిరోధక శక్తిని అందిస్తుంది. ఇది క్యాన్సర్ కణాలను నియంత్రించడంలో సహాయపడుతుంది. శరీరంలో క్యాన్సర్ కణాలతో పోరాడే ప్రతిరోధకాలను ఉత్పత్తి చేయడం ద్వారా, ఇది కణితిని నియంత్రించడంలో సహాయపడుతుంది. గర్భాశయ క్యాన్సర్‌తో సహా అనేక ప్రాణాంతక, ప్రమాదకరమైన కణితి కణాలకు వ్యతిరేకంగా కూడా ఈ టీకా ప్రభావవంతంగా ఉంటుందని రష్యా అంటోంది. వైద్యరంగంలో క్యాన్సర్ వ్యాక్సిన్ అనేది ఒక ప్రధాన మైలురాయి కానుంది. అనేక దేశాలు క్యాన్సర్‌తో పోరాడటానికి టీకాలు, మందులను అభివృద్ధి చేస్తున్నాయి. అయితే అవి ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి. రష్యా వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసినట్లు ప్రకటించడంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు. రష్యా ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్యాన్సర్ వ్యాక్సిన్ ఉచితంగా అందుబాటులో ఉ ంటుంది. ఈ ఏడాది ప్రారంభంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఒక ప్రకటన చేశారు. క్యాన్సర్‌తో పోరాడే వ్యాక్సిన్‌ను రష్యా అభివృద్ధి చేసిందని చెప్పారు. ఈ వ్యాక్సిన్ ప్రయోగాత్మక దశలో మంచి ఫలితాలను చూపిందన్నారు. ఈ వ్యాక్సిన్‌ని అభివృద్ధి చేయడంలో దాదాపు విజయం సాధించామని తెలిపారు. ఇప్పుడు తాజాగా క్యాన్సర్ వ్యాక్సిన్ గురించి రష్యా ప్రకటన చేసింది.

## ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో

# ఏ1గా కేటీఆర్

మొదటి పేజీ తరువాయి...

కోరగా, సుమారు నెల రోజుల తర్వాత ఇటీవల అనుమతి లభించింది. దీంతో ఏసీబీ విచారణ వేగవంతం చేసింది. ఫార్ములా-ఈ ఆపరేషన్స్, ఎస్ నెక్స్ట్ జెన్, పురపాలకశాఖల మధ్య 9, 10, 11, 12వ సీజన్ల కార్ రేస్‌లు నిర్వహించేలా ఒప్పందం కుదిరింది. 2023 ఫిబ్రవరి 10, 11 తేదీల్లో నె÷-లకెస్‌రోడ్డులో తొమ్మిదో సీజన్ రేసింగ్ నిర్వహించారు. 'అప్పటి మంత్రి కేటీఆర్ ఆమోదంతోనే ఒప్పందం కుదిరింది. శాఖాధిపతిగా ఎంవోయూ చేశా' అని ఒప్పందంపై ఐఏఎస్ అర్వింద్ కుమార్ సీఎస్‌కు సమాధానమిచ్చారు. ఈ రేసు నిర్వహించిన విదేశీ సంస్థకు హెచ్ఎండీఏ బోర్డు, ఆర్థిక శాఖ, ఆర్బీఐల అనుమతి తీసుకోకుండానే నేరుగా రూ.55 కోట్లు చెల్లించడం వివాదాస్పదంగా మారింది. ముఖ్యంగా రూ.46 కోట్ల వరకు డాలర్ల రూపంలో చెల్లించారనేది ప్రధాన అభియోగం. వీటన్నింటిపైనా అనిశా దర్యాప్తు చేయనుంది. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్నట్లు భావించిన, అనుమానించిన వారందరికీ ఏసీబీ నోటీసులు ఇవ్వనుంది. వారిని విచారించి, వాంగ్మూలాలను నమోదు చేస్తుంది. అధికార దుర్వినియోగం జరిగినట్లు తేలితే సంబంధిత ఆధారాలను సేకరిస్తుంది. ముఖ్యంగా ఇందులో నిధుల మళ్లింపు కోణం ఏమైనా ఉందా...? అనే అంశంపై ఎసిబి ఎక్కువ దృష్టి సారించనుంది. ఫార్ములా సంస్థకు చెల్లించిన రూ.55 కోట్లు ఎక్కడెక్కడి నుంచి చివరికి ఎవరి ఖాతాలోకి వెళ్లాయనే కోణంలోనూ పరిశీలించే అవకాశముంది. ఫార్ములా-ఈ రేస్ నిర్వహించిన సంస్థలకు సైతం నోటీసులు జారీ చేయడానికి అవకాశముంది. అధికార దుర్వినియోగంపై ప్రాథమిక ఆధారాలు లభిస్తే... అందుకు బాధ్యులైన వారి అరెస్టు తప్పకపోవచ్చు. అదే జరిగితే ముమ్ముందు ఫార్ములా-ఈ కార్ రేసు వ్యవహారం సంచలనాత్మకంగా మారుతుందని భావిస్తున్నారు. 2023, ఫిబ్రవరి 11న ఎంతో ప్రతిష్టాత్మకంగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం హుస్సేన్ సాగర్ చుట్టూ దాదాపు 2.8 కిలోమీటర్ల ఈ కార్ రేసింగ్ పెట్టింది. అయితే ఈ కార్ రేసింగ్ వ్యవహారినికి సంబంధించి దాదాపు రూ.55 కోట్ల వరకు ఆర్థిక శాఖ అనుమతి లేకుండా సంబంధిత డిపార్ట్‌మెంట్ అనుమతి లేకుండానే విదేశీ కంపెనీకి నిధులు విడుదలయ్యాయి. అయితే రూ.55 కోట్ల వ్యవహారంలో అవకతవకలు జరిగాయని, నిధుల దుర్వినియోగం జరిగాయని ఇప్పుడు కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించింది. ఈ నిధుల గోల్‌మాల్‌పై విచారణకు సర్కార్ ఆదేశించింది. ఆర్థికశాఖ అనుమతులకు సంబంధించి ఎక్కడా రికార్డ్స్‌లో లేకపోవడంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి. విదేశీ కంపెనీలకు ఇంత భారీ మొత్తాన్ని ఎలాంటి అనుమతులు లేకండా ఏ విధంగా అప్పగించారని దానిపై స్పష్టత లేకుండాపోయింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

## ఈ రేస్ వ్యవహారంపై శాసనసభలో చర్చ పెట్టాలి

**హైదరాబాద్, డిసెంబర్ 19 (ప్రభాత ఉదయం):** ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారంలో ఏసీబీ తనపై కేసు నమోదు చేయడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ వ్యవహారంపై శాసనసభలో చర్చ పెట్టాలని అన్నారు. సమాధానం చెప్పేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు సవాల్ విసిరారు. 'నిజంగా ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి, ధైర్యం, ప్రజలకు వాస్తవాలు తెలియాలని ఉంటే ఫార్ములా ఈ రేస్ వ్యవహారంపై అసెంబ్లీలో చర్చ పెట్టాలి. ఫార్ములా ఈ రేస్‌లో కుంభకోణం జరిగిందని అంటున్నారు. చర్చ జరిగితే అన్ని విషయాలు క్షుణ్ణంగా వివరిస్తా.' అని కేటీఆర్ స్పష్టం చేశారు. మరోవైపు, మాజీ మంత్రి హరీష్ రావు ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని శాసనసభలో ప్రస్తావిస్తూ.. 'మేము ఏదైనా ప్రశ్నిస్తే మమ్మల్ని దబాయించి విచారణ పేరిట రేవంత్ రెడ్డి ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోంది. ఇదే కదా మీరు చేసేది. రాష్ట్ర ఇమేజ్ కోసం ప్రయత్నిస్తే కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టారు.' అని మండిపడ్డారు. అటు, ఈ అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సైతం స్పందించారు. రాజకీయంగా ఎదుర్కోలేక బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం బనాయిస్తోన్న అక్రమ కేసుల డ్రామాను తెలంగాణ ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని అన్నారు. కేటీఆర్‌పై అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురి చేసే ప్రయత్నం రాజకీయ అమాయకత్వమే తప్ప మరొకటి కాదని కవిత పేర్కొన్నారు.



## బార్డర్ చెక్ పోస్టుల వద్ద వడ్ల లారీలు నిలిపివేత?

### డీఎస్ఓ ఆదేశాల రిలీజ్ చేసిన అధికారులు

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 19(ప్రభాత ఉదయం) తెలంగాణలో పండించిన వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 2,320 మద్దతు ధరతో పాటు, రూ.500 చొప్పున ప్రభుత్వం బోనస్ ఇవ్వడంతో కర్ణాటక వడ్లను దళారులు తెలంగాణలోని పలు మిల్లులు, కొనుగోలు కేంద్రాల్లో వడ్లను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన తెలంగాణ ప్రభుత్వం ఇతర రాష్ట్రాల నుంచి వరి ధాన్యంతో వస్తున్న లారీలను బార్డర్ చెక్ పోస్టులోనే నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. కర్ణాటక నుంచి వరి ధాన్యాన్ని తెలంగాణలోని పలు జిల్లాలో విక్రయించడానికి తరలిస్తున్న నేపథ్యంలో జోగులాంబ గద్వాల జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు ఆదేశాల మేరకు గురువారం కేటిదొడ్డి మండలం నందిన్నె చెక్ పోస్టు వద్ద అధికారులు కొన్ని వడ్ల లోడ్ లారీలను వెనక్కి పంపించేశారు. దీంతో కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా సింగనేడి చెక్ పోస్టు నుంచి నందిన్నె చెక్ పోస్టు వద్దకు వరి ధాన్యం లారీలు నిలిచిపోయాయి. దీంతో ఇరు రాష్ట్రాల చెక్ పోస్టులో కొంత గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఆ తర్వాత డిఎస్ఓ అధికారుల ఆదేశాల మేరకు వే బిల్లులు ఉన్న వాటికి మాత్రమే గద్వాల జిల్లా మీదుగా తరలించడానికి అనుమతులు ఇచ్చారు. పదుల సంఖ్యలో లారీలకు రిలీజ్ ఆర్డర్ లు ఇవ్వడంతో వదిలేసినట్లు తెలిసింది.తెలంగాణలో సన్నొడ్లకు రూ.2,320 మద్దతుధర, రూ.500 ప్రభుత్వం బోనస్ ఇస్తుండడంతో దళారులు కర్ణాటకలో భారీ మొత్తంలో సన్నొడ్లు కొని వాటిని తెలంగాణకు తీసుకొస్తున్నారు. ముఖ్యంగా కర్ణాటక నుంచి ఉమ్మడి నల్గొండ, సూర్యాపేట జిల్లాలోని మిల్లులు, కొనుగోలు కేంద్రాల్లో వడ్లను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దందాలో భాగస్వాములైన మిల్లర్లు, దళారులకు ఆఫీసర్లు సైతం సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రంగు రంగుల విద్యుత్ దీపాలతో వ్యవసాయ విశ్వవిద్యాలయం ముఖ ద్వారం





రంగుల రంగుల విద్యుత్ దీపాలతో వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనం

## వజ్రోత్సవాల సందర్భంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని పలు భవనాలకు విద్యుత్ కాంతులు



దీపాల కాంతులతో వ్యవసాయ విశ్వవిద్యాలయం ముఖ ద్వారం ..



ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం



రంగు రంగుల విద్యుత్ దీపాల కాంతుల మధ్య వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియం

# వజ్రోత్సవాలకు ముస్తాబవుతోన్న ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి : ప్రొఫెసర్ జానయ్య

బుద్వేల్,డిసెంబరు19(ప్రభాత ఉదయం): వజ్రోత్సవ ఉత్సవాల కోసం రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. విశ్వవిద్యాలయం ఆడిటోరియం, స్పోర్ట్స్ కాంప్లెక్స్ లలో డిసెంబర్ 20, 21 తేదీల్లో ఈ వజ్రోత్సవ ఉత్సవాలని ఘనంగా నిర్వహించడానికి ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన విశ్వవిద్యాలయ ప్రస్థానాన్ని వివరించారు. 1955 జనవరిలో నాటి హైదరాబాద్ రాష్ట్ర తొలి వ్యవసాయ శాఖ మంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి చొరవతో గొప్ప విద్యావేత్త, మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ గారి చేతులమీదుగా 1964 లో రాజేంద్రనగర్ వద్ద వ్యవసాయ కళాశాల ప్రారంభంతో నాటి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ఈ ప్రాంతంలో అంకురార్పణ జరిగింది. ఈ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని 1965 సంవత్సరం, మార్చి 20వ తేదీన నాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి రాష్ట్ర రైతాంగానికి అంకితం చేశారు. తర్వాత 1966 సంవత్సరం జూన్ 23 వ తేదీన నాటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ ప్రస్తుత విశ్వవిద్యాలయ పరిపాలన భవనాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలోనే 1996 లో ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, రైతు నాయకులు ఆచార్య ఎన్ జీ రంగా పేరుని విశ్వవిద్యాలయానికి పెట్టారు. రాష్ట్ర విభజన అనంతరం ప్రముఖ ఆర్థికవేత్త, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ పేరుతో 2014 సెప్టెంబర్ 3వ తేదీన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంగా తెలంగాణ రాష్ట్రంలో తన ప్రాధాన్యాన్ని కొనసాగించింది. ప్రస్తుతం ఈ విశ్వవిద్యాలయ పరిధిలో 11 కళాశాలలు, 12 వ్యవసాయ పాలిటెక్నిక్ లు, 3 ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాలు, 12 వ్యవసాయ పరిశోధన స్థానాలు, 8 కృషి విజ్ఞాన కేంద్రాలు, 9 ఏరువాక కేంద్రాలున్నాయి. రైతులు, విద్యార్థులకు అపార సేవలు అందిస్తూ రాష్ట్ర, దేశ వ్యవసాయ సర్వతోముఖాభివృద్ధికి మానవ వనరుల అభివృద్ధికి వ్యవసాయ విశ్వవిద్యాలయం విశేష కృషి చేస్తుంది. విశ్వవిద్యాలయ 60 వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలని డిసెంబర్ 20,21 తేదీల్లో పండుగ వాతావరణం లో నిర్వహించడానికి ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. డిసెంబర్ 20వ తేదీ ఉదయం 9 గంటలకు ఉత్సవాల ప్రారంభ సమావేశం ఉంటుంది. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ సహకార చేనేత జౌళి శాఖల మంత్రి



వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనం

తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. ముఖ్యఅతిథిగా పరిశ్రమలు, ఐటి, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్లు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థి, తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నా రెడ్డి, నీతి ఆయోగ్ సభ్యులు, ప్రముఖ వ్యవసాయ ఆర్థికవేత్త ప్రొఫెసర్ రమేష్ చంద్ ప్రారంభ ఉపన్యాసం చేయనున్నారు. వీరితోపాటు కోదండ రెడ్డి, మాజీ వ్యవసాయశాఖ మంత్రులు, మాజీ ఉప కులపతులు, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు, వివిధ అధికారులతో పాటు ఈ విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొననున్నారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విశ్వవిద్యాలయ కులపతి మరియు గవర్నర్ గౌరవ శ్రీ జిష్ణుదేవ్ వర్మ గారు వ్యవసాయ ప్రదర్శనను ప్రారంభం చేయనున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 4000 మంది రైతులతో కిసాన్ మేళ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవ శ్రీ రేవంత్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. డిప్యూటీ సి.ఎం బట్టి విక్రమార్క మల్లు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నా రెడ్డి హాజరవుతారు. అలాగే దీనిలో ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ వ్యవసాయ రైతు, సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం



ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య

నరేందర్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎం.పి కొండ విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొంటారు.

**రెండవ రోజు :**

రెండవ రోజు అయిన డిసెంబర్ 21వ తేదీన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరగనుంది. ఈ సమ్మేళనం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నా రెడ్డి అధ్యక్షతన జరుగుతుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, పూర్వ విద్యార్థి మర్రి శశిధర్ రెడ్డి, పూర్వ ఉపకులపతి డాక్టర్ సురవరం రఘువర్ధన్ రెడ్డి, వ్యవసాయ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి, మాజీ ఆర్థిక కార్యదర్శి వి. నాగిరెడ్డి కార్యక్రమంలో పాల్గొంటారు. వీరితోపాటు ఆసియాభివృద్ధి బ్యాంక్ లో కీలక అధికారి అయిన వ్యవసాయ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి డాక్టర్ అంచె శ్రీనివాసన్, అమెరికాలోని క్యాన్సర్ స్టేట్ యూనివర్సిటీ ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ వరప్రసాద్ ఈ సమావేశంలో వజ్రోత్సవ ప్రసంగం చేయనున్నారు. సాయంత్రం జరగనున్న ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ సహకార చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐ సీ ఏ ఆర్ డీడీజీ డాక్టర్ ఆర్ సీ అగర్వాల్, నార్మ్ డైరెక్టర్ డాక్టర్ సీ హెచ్. శ్రీనివాసరావు, తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డిలు పాల్గొని ఉత్తమ రైతులకు మరియు విద్యారంగంలో రాణించిన విద్యార్థులకు అవార్డులను బహుకరిస్తారు.



## భవానీకాలనీ సమస్యలపై వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం

### పలు తీర్మాణాలకు ఆమోదం..

రాజేంద్రనగర్,డిసెంబర్19(ప్రభాత ఉదయం) భవానీకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు ఎం.శ్రీనివాస్ యాదవ్ అన్నారు.అసోసియేషన్ అధ్యక్షులు ఎం.శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన కోరు కమిటీ సమావేశంలో పలు విషయాలపై చర్చించి తీర్మాణం చేశారు.భవానికాలనీలో 32 కెమెరాలు ఏర్పాటు చేయడం పూర్తయ్యిందని,అందులో భాగంగా బీసీడబ్ల్యూఏ కార్యాలయంలో మోనిటర్ ని ఏర్పాటు చేయటము జరిగిందన్నారు.దానిని పోలీసు కమాండ్ కంట్రోల్ తో అనుసంధానానికి జియో ఫైబర్ నెట్వర్క్ ను తీసుకోవటం జరిగిందన్నారు.రాబోవు రోజుల్లో ఇంకా కొన్ని కెమెరాలు పెంచుటకు నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు.కాలనీ రోడ్ల నిర్మాణం గురించి జోనల్ కమిషనర్ ను కలవటానికి చర్చించడం జరిగింది.కాలనీ రిజర్వేషన్ సభ్యులు అందరు కూడా కలిసి రావాల్సిందిగా తీర్మాణం చేయడం జరిగిందన్నారు.కాలనీలో నీటి సమస్య తీవ్రంగా ఉందని లైన్మెన్ ను పిలిచి సమస్యపై చర్చించామన్నారు.వీలైనంతవరకు నీటి సమస్య లేకుండా అందరికీ సరిపోయేంత నీళ్లను సరఫరా చేయుటకు కృషి చేయాలని లైన్ మెన్ కు సూచించామన్నారు.కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులపై తీవ్రమైన ఆరోపణలు చేసిన శ్రీధర్ రెడ్డిని ఆఫీసుకు వచ్చి ఆరోపణలపై వివరణ ఇవ్వాలని కోరినా అతను సమావేశానికి హాజరు కాలేదని,అతనిపై క్రమశిక్షణ చర్య తీసుకుంటూ అతన్ని బీసీడబ్ల్యూఏ వాట్సప్ గ్రూప్ నుంచి తొలగించుటకు నిర్ణయించినట్లు తెలిపారు.



## ఆశలకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

### ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి జె భాగ్య

కొత్తకోట, డిసెంబర్ 19(ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆశ కార్యకర్తలు తమ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ గత ప్రభుత్వంలో ధర్నాలు చేయడం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఆశ కార్యకర్తలకు ఫిక్స్డ్ వేతనం 18,000 ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందని వాటిని అమలు చేయాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి జె భాగ్య, డిమాండ్ చేశారు. గురువారం కొత్తకోట మండల కేంద్రంలోని పిహెచ్సి దగ్గర ఆశ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్య, మాట్లాడుతూ ఆశ కార్యకర్త సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఈ నెల 23న బస్సు యాత్ర ద్వారా వనపర్తి జిల్లాకు చేరుకుంటుందని ఆమె చెప్పారు. ఆశలకు ఇప్పటికే పని భారం అధికంగా ఉందని వేతనాలు మాత్రం చాలా తక్కువగా ఇస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని కనీస వేతనం నెల 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ,సౌకర్యం ఉద్యోగ భద్రత, పర్మనెంట్ చేయాలని ప్రభుత్వాన్నిఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు సంతోష,పుష్ప, వరలక్ష్మి, పావని,భాగ్య,లక్ష్మి,గీత, చిన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## సహజీవనం తప్పుడు విధానం

### కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

**న్యూఢిల్లీ, డిసెంబర్ 19 (ప్రభాత ఉదయం):** సహజీవనం తప్పుడు విధానమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఇది సమాజ సిద్ధాంతాలకు వ్యతిరేకమన్నారు. స్వలింగ సంపర్కుల వివాహాలతో.. సామాజిక వ్యవస్థ దెబ్బతింటుందని ఆయన ఆరోపించారు. యూట్యూబ్ పోడ్కాస్ట్కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. బ్రిటన్లో అతి పెద్ద సమస్య సహజీవనమే అని, పెళ్లిని వ్యతిరేకించడం పెద్ద సమస్యగా మారినట్లు ఇటీవల బ్రిటీష్ పార్లమెంట్ వెళ్లినప్పుడు అక్కడ తమకు తెలిసిందన్నారు. ఒకవేళ మీరు పెళ్లి చేసుకోకపోతే, అప్పుడు మీరెలా పిల్లల్ని కంటారని గడ్కరీ అడిగారు. ఒకవేళ పిల్లలు పుడితే, వాళ్ల భవిష్యత్తు ఏంటి ఆయన ప్రశ్నించారు. సమాజ వ్యవస్థకు వ్యతిరేకంగా వెళ్తే, అది ప్రజలపై ఎటువంటి ప్రభావం చూపుతుందని ప్రశ్నించినట్లు తెలిపారు. సమాజం తనంతటే తాను నిర్ణయాలు తీసుకుంటుందని, కానీ దేశంలో లింగ నిష్పత్తి సమంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఒకవేళ 1500 మంది మహిళలు, 1000 మంది పురుషులు ఉంటే, అప్పుడు ఇద్దరు భార్యలకు పురుషుల అర్హులని ఆయన అన్నారు. ఆదర్శ భారత దేశంలో విడాకుల్ని బ్యాన్ చేయాలన్న దాన్ని ఆయన ఖండించారు. సహజీవనం మంచిది కాదన్నారు. సేమ్ సెక్స్ మ్యారేజ్ను వ్యతిరేకిస్తూ గత ఏడాది సుప్రీంకోర్టుకు చెందిన అయిదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే.



## ఘనంగా దండమూడి శోభనాద్రి జయంతి వేడుకలు

కూకట్పల్లి,డిసెంబర్ 19 (ప్రభాత ఉదయం) కూకట్పల్లి నియోజకవర్గం కెపిహెచ్బి కాలనీ మొట్టమొదటి జిహెచ్ఎంసి కార్పొరేటర్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కీర్తిశేశులు దండమూడి శోభనాద్రి జయంతి సందర్భంగా జె ఎన్ టి యు ఎన్ టి ఆర్ సర్కిల్ వద్ద అట్లూరి దీపక్ ఆధ్వర్యంలో ఆయన అభిమానులు, శ్రేయోభిలాషులు ఘనంగా నివాళి అర్పించి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చందర్ రావు, వేములపల్లి రాజా, సాయిబాబ చౌదరి, ఆర్ కె చౌదరి, గోపికృష్ణ కాకర్ల, కొల్లూరి శ్రీను, పవన్ మార్ని, మదన్ మోహన్, గౌతం రెడ్డి, వడ్లమూడి హరిబాబు తదితరిలు పాల్గొన్నారు.

### ఆకస్మికంగా పాఠశాలను తనిఖీ చేసిన

## గద్వాల కోర్టు న్యాయమూర్తి గంట కవితా దేవి



హాస్టల్ ఆవరణలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ను చూపిస్తున్న జిల్లా న్యాయ సేవా సహకార సంస్థ చైర్మన్ గంటా కవితా దేవి



విద్యార్థుల భోజనాలను పరిశీలిస్తున్న కవితా దేవి

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 19(ప్రభాత ఉదయం) గద్యాల పట్టణంలోని బురద పేటలో ప్రభుత్వ ఉన్నత ప్రాథమిల పాఠశాలను గురువారం జిల్లా న్యాయ సేవాధి కార సంస్థ కార్యదర్శి గంటా కవితా దేవి అకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణను పరిశీలించి వారి యొక్క సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వల్ల విద్యార్థులతో పాటు కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీని పై సంబంధిత అధికారులు చర్యలు తీసుకునేలా సూచనలు చేస్తామన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం పట్టిక మెనూ ప్రకారం విధ్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మీ మొక్క సమస్యలను వ్రాత పూర్వకంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలని సూచించారు. ఆమె వెంటా ఉపాధ్యాయులు ఉన్నారు.

# వ్యవసాయ విశ్వవిద్యాలయ వజ్రోత్సవ ఏర్పాట్లు పర్యవేక్షించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు






వజ్రోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం రఘునందన్ రావు, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య

బుద్వేల్,డిసెంబరు19(ప్రభాత ఉదయం): ఈ నెల 20, 21వ తేదీలలో రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం లో జరుగనున్న వజ్రోత్సవాల ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు సూచించారు. మహిళా రైతులు కూర్చోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఈరోజు ఉదయం వ్యవసాయ కార్యదర్శి ఎం రఘునందన్ రావు , , కమిషనర్ బి. గోపి లతో కలిసి మంత్రి రాజేంద్రనగర్ లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఆడిటోరియంను పరిశీలించారు. ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, ఇతర ఉన్నతాధికారులు జరుగుతున్న ఏర్పాట్లను మంత్రికి వివారించారు. కార్యక్రమాల నిర్వహణలో సమయపాలన పాటించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతులకి ఉపయోగపడేలా, ఆవరణలో అనువైన ప్రదర్శనలు ఏర్పాటు చేయాలన్నారు. గవర్నర్ మరియు విశ్వవిద్యాలయ కులపతి గౌరవ జిష్ణు దేవ్ వర్మ, గౌరవ ముఖ్య మంత్రి ఏ రేవంత్ రెడ్డి, పర్యటన, ప్రసంగ కార్యక్రమాల్లో సమయపాలన పాటించాలని తుమ్మల నాగేశ్వరరావు సూచించారు.



ఏర్పాట్ల గురించి అడిగి తెలుసు కుంటున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

# భూ భారతి చట్టం ప్రకటనపై బీఆర్ఎస్ నోటీసులు




హైదరాబాద్, డిసెంబర్ 19 (ప్రభాత ఉదయం): రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి పేరుతో కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకువస్తున్నది. ఈ నేపథ్యంలో భూ భారతి చట్టంపై వివిధ పత్రికల్లో ఫుల్ పేజీ ప్రకటనలు గుప్పించింది. దీనిపై బీఆర్ఎస్ పార్టీ సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చింది. శాసనసభ హక్కులను రక్షించాలని స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను బీఆర్ఎస్ శాసనసభా పక్షం కోరింది. డిసెంబర్ 19న (గురువారం) దినపత్రికల్లో చట్టానికి సంబంధించి ప్రభుత్వం ప్రకటనలు ఇచ్చిందని, ఆమోదం పొందని బిల్లును చట్టంగా ప్రకటించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పత్రికల్లో భారీ ప్రకటనల ద్వారా ప్రజలను ప్రభుత్వం తప్పుదోవ పట్టించిందని పేర్కొంది. శాసనసభలో చర్చ దశలో ఉన్న బిల్లును చట్టంగా పేర్కొనడంతో భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 245 ప్రకారం సభా హక్కులకు హాని జరిగిందని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త రెవెన్యూ చట్టం 'భూ భారతి'తో రెవెన్యూ రికార్డుల నిర్వహణలో అనేక మార్పులు జరగనున్నాయి. రాష్ట్రంలోని ప్రతి భూ కమతానికి ఆధార్ తరహాలో 'భూదార్' నంబర్‌ను కేటాయించనున్నారు. ఇకపై భూ క్రయవిక్రయాలు జరిపే సమయంలో ముందుగా ఆ భూమిని సర్వే చేయించాల్సి ఉంటుంది. ఆ తర్వాతే రిజిస్ట్రేషన్ జరుగుతుంది. ధరణి పోర్టల్‌లో అందుబాటులో ఉన్న 'ఇన్‌స్టెంట్ మ్యుటేషన్'ను కొ త్త చట్టంలోనూ కొనసాగించారు. క్రయవిక్రయాల సమయంలో రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక మ్యుటేషన్ కూడా పూర్తవుతుంది. కానీ, వారసత్వంగా జరిగే భూముల బదిలీ (ఫౌతీ)లో కొత్త నిబంధన తీసుకొచ్చారు. తాసిల్దార్ ఆఫీస్‌లో రిజిస్ట్రేషన్ జరిగినా.. మ్యుటేషన్ చేసే అధికారాన్ని మాత్రం ఆర్డీవోకు అప్పగించారు. నిర్ణీత కాలంపాటు (30 రోజులు) మ్యుటేషన్ చేయకుండా నిలిపివేస్తారు. ఆలోగా ఆ భూమి పై ఎలాంటి ఫిర్యాదులు రాకపోతే ప్రక్రియ పూర్తి చేస్తారు. కోర్టు ద్వారా వచ్చే, ఓఆర్సీ, 38-ఈ తదితర మొత్తం 14 రకాల భూమి హకులపై మ్యుటేషన్ అధికారాలను ఆర్డీవోకు కట్టబెట్టారు. ఇప్పటివరకు ధరణి పోర్టల్‌లో మొత్తం 33 మాడ్యూళ్లు ఉండగా.. భూభారతిలో వాటిని 6కు తగ్గించనున్నారు. భూమి పట్టాలో కేవలం రైతు పేరు మాత్రమే ఉండగా.. ఇకపై అనుభవదారు కాలమ్ సహా మొత్తం 11 కాలమ్‌లు ఉంటాయి. పార్ట్-బీ కేసులు పరిష్కారమైనవారి వివరాలను భూ రికార్డుల్లో ఎక్కించి, పాస్ బుక్ ఇచ్చేలా మార్పులు చేశారు. తాసిల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్లకు అధికారం ఇచ్చారు. సాదాబైనామాల క్రమబద్ధీకరణ చేస్తామని ప్రభుత్వం తెలిపింది. గ్రామ కంఠం, ఆబాదీలకు హకుల రికార్డును రూపొందిస్తుంది. 2014 వరకు సబ్ రిజిస్ట్రార్ల వద్ద రికార్డుల్లో ఉన్న 'ప్రభుత్వ భూముల' వివరాలను ప్రస్తుతం ధరణిలో ఉన్న డాటాతో సరిపోల్చనున్నట్టు ప్రభుత్వం చెప్తున్నది. ఆయా సర్వే నంబర్లలోని భూములన్నింటినీ ప్రభుత్వ భూములుగా పరిగణించి నిషేధిత జాబితాలో చేర్చుతామని తెలిపింది. దీంతో 2014కు ముందు పొరపాటున ప్రభుత్వ భూమిగా నమోదై.. 2014 తర్వాత వివాదం ముగిసి, పట్టాభూమిగా మారిన భూములన్నీ ఇప్పుడు మళ్లీ నిషేధిత జాబితాలోకి చేరనున్నాయి. కొత్త రెవెన్యూ చట్టానికి సంబంధించిన నియమ నిబంధనలను 3 నెలల్లో తీసుకురానున్నారు.



## నిర్మాణపు పనులన్నింటినీ వేగవంతంగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 19(ప్రభాత ఉదయం)జిల్లాలో చేపట్టిన నిర్మాణపు పనులన్నింటినీ వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ శాఖల ఈ ఈ లు, డీ.ఈ లతో, టీఎస్ఎంఐడీసీ, ఈడబ్ల్యూఐడీసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల ఇంజనీరింగ్ అధికారులను పనుల పురోగతికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మంజూరైన వివిధ నిర్మాణపు పనుల పురోగతిని, అసంపూర్తిగా ఉన్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈడబ్ల్యూఐడీసీ పరిధిలోగల నిర్మాణపు పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ముఖ్యంగా కేజీబీవీ రాజోలీ, బాలసధన్ పూర్తి చేసి, నెలవారీ పురోగతి నివేదికలను అందించాలని ఆదేశించారు. టీఎస్ఎంఐడీసీ అధికారులను మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, క్రిటికల్ కేర్, సబ్ సెంటర్ల అసంపూర్తిగా ఉన్న పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫెడ్.డిఆర్ పనులు, రోడ్ల పనులు, విస్తరణ పనులు, బీటీ రోడ్లు, కనెక్టివిటీ, సీసీ రోడ్లను, భవనాల నిర్మాణపు పనులు పూర్తి చేయాలని ఆర్ అండ్ బి శాఖ అధికారులను సూచించారు. గ్రామాల్లో పెండింగ్ పనులను పర్యవేక్షించి పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అన్ని శాఖలు తమ పరిధిలో ఉన్న పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మంజూరు అయినా పనులన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. చేపట్టిన పనులను త్వరలోనే క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని, పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జెడ్పీ సి.ఈ.ఓ కాంతమ్మ, టిఎస్ఎంఐడిసి డి.ఈ శ్రీనివాసులు,ఈ.ఈ పీ.ఆర్ దామోదర్ రావు, ఆర్ అండ్ బి ఈ.ఈ ప్రగతి, ఎ.ఈలు, ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## అనారోగ్యంతో బాధపడుతున్న ఆర్ఎంపీ వైద్యులకు చేయూత

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 19(ప్రభాత ఉదయం)అయిజ మండలం చిన్న తాండ్రపాడు గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యులు సుందర్ రాజ గత కొన్ని రోజుల నుండి అనారోగ్యం తో బాధ పడుతున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పి.విజయ్, కార్యవర్గ సభ్యులు గురువారం బాధితుడిని పరామర్శించి ఆరోగ్యంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్పందించిన అసోసియేషన్ సభ్యులు దాతల సహకారంతో సేకరించిన రూ. 16,000 నగదును ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి.విజయ్, మరియు జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



బిఆర్ఎస్ యువనేత కార్తీక్ రెడ్డిని బహదూర్ గూడ రైతులు

## బహదూర్ గూడ రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం


### రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి.

### శంషాబాద్.. 75 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వండి.

శంషాబాద్, డిసెంబర్ 19(ప్రభాత ఉదయం) శంషాబాద్ మండలంలోని బహదూర్ గూడ గ్రామంలో దేశానికి స్వాతంత్రం రాక ముందటి నుండి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న రైతులకు వెంటనే పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి డిమాండ్ చేశారు. శంషాబాద్ మాజీ జెడ్పిటిసి డిసిసిబి డైరెక్టర్ బూర్కుంట సతీష్.. నార్సింగ్ వ్యవసాయ కమిటీ మాజీ చైర్మన్ మంచర్ల మమత శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైతులు గురువారం కార్తీక్ రెడ్డి ని కలిసి తమ సమస్యలను ఏకరువు పెట్టుకున్నారు. రెవిన్యూ రికార్డులు పుట్టక ముందటి నుండి తాము ఆ భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నామని తమ పూర్వీకుల నుండి తమకు వచ్చిన భూమిలో తమకు పట్టాదారు పాసుబుక్కులు ఇవ్వడం లేదని వారు తెలిపారు. ఆ భూముల మీదనే ఆధారపడి జీవిస్తున్న తమకు ప్రభుత్వం అన్యాయం చేస్తున్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యలు విన్న కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ రైతులందరూ ఏకమై ప్రభుత్వంపై చేస్తున్న పోరాటానికి తన పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. దీర్ఘకాలికంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యను ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దాదాపు 30. 40 సంవత్సరాల నుండి రైతులు ఆందోళన చేస్తున్న ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు న్యాయం చేయడం కోసం తాను రైతుల ఆందోళనకు మద్దతు ప్రకటిస్తున్నానని కార్తీక్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు చలివేంద్రి వెంకట్ రెడ్డి. హనుమంతు ముదిరాజ్. చిన్న గండు రాజేందర్. తదితరులు పాల్గొన్నారు.

## 'బలగం' మొగిలయ్య కన్నుమూత

హైదరాబాద్, డిసెంబర్ 19 (ప్రభాత ఉదయం): జానపద కళాకారుడు, 'బలగం' మూవీ ఫేమ్ మొగిలయ్య తుది శ్వాస విడిచారు. ఆయన వయసు 67 సంవత్సరాలు. వరంగల్ లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన గురువారం తెల్లవారుజామున కన్ను మూసినట్టుగా తెలుస్తోంది. దీంతో పలువురు ప్రముఖులు, మూవీ లవర్స్ ఆయనకు సోషల్ మీడియా వేదికగా నివాళులు అర్పిస్తున్నారు. మొగిలయ్య స్వగ్రామం వరంగల్ జిల్లాలోని, నర్సంపేట నియోజకవర్గంలో ఉన్న దుగ్గొండి. మొగులయ్య తన భార్య కొమరమ్మతో కలిసి బుర్రకథలు చెప్పుకుంటూ జీవితాన్ని గడుపుతున్నారు. ఈ దంపతులకు పూర్వీకుల నుంచి సాంప్రదాయంగా అబ్బిన ఈ బుర్రకథ కళను ప్రేక్షకుల ముందు ప్రదర్శించడమే జీవనాధారం.



## కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఉన్న ట్రాఫిక్ సమస్యపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

### సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వినతి

కూకట్‌పల్లి,డిసెంబర్ 19 (ప్రభాత ఉదయం) కూకట్‌పల్లి నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యపై తక్షణమే చర్యలు తీసుకోవాలని గురువారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వినతిపత్రాన్ని అందించారు. ముఖ్యంగా మూసాపేట ఆంజనేయనగర్ సర్కిల్ వద్ద ఒకటి, వసంతనగర్ గోకుల్ చౌరస్తా నుంచి వసంత విహార్ వరకు మరో ఫ్లై ఓవర్‌లను నిర్మించాలని, క్రీడాకారులకు అనువుగా స్టేడియం నిర్మాణం కోసం హుడా ట్రక్ పార్క్ స్థలాన్ని కేటాయించి క్రికెట్ తో పాటు ఇతర క్రీడలకు అనువైన వసతులు కల్పించాలని వినతిపత్రంలో ఉన్నట్లు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వెల్లడించారు. ఇందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.




## కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను మంత్రివర్గం నుండి బహిష్కరించాలి

### కాంగ్రెస్ పార్టీ నాయకులు మట్టే ప్రసన్నకుమార్

కూకట్‌పల్లి,డిసెంబర్ 19 (ప్రభాత ఉదయం) ట్యాంక్ బండ్ వద్ద భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ ని అవమానపరిచే విధంగా మాట్లాడిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ను మంత్రివర్గం నుండి బహిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, నాగరిగారి ప్రీతం ఆధ్వర్యంలో దళిత సంఘాల నేతలు, భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. అమిత్ షా బాబాసాహెబ్ అంబేద్కర్ కి బహిరంగ క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతం, కంటెస్టెడ్ ఎమ్మెల్యే బి సంజీవరావు, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఎస్సీ చైర్మన్ పత్తి కుమార్, బాలనగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టే ప్రసన్నకుమార్, జిల్లా ఎస్సి విభాగం వైస్ చైర్మన్ మదన్ మోహన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమ్ము బాబురావు, జావిద్, ఏ రాజు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### దారిదోపిడికి దోపిడీకి పాల్పడ్డ

## ఇద్దరు యువకులు అరెస్ట్

### వారి వద్ద నుండి సెల్ ఫోన్, బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్న బాలానగర్ పోలీసులు

కూకట్‌పల్లి, డిసెంబర్ 19 (ప్రభాత ఉదయం) ఈజీ మనీ కోసం అలవాటు పడి దారిదోపిడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గురువారం బాలానగర్ ఏసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసిపి హనుమంతరావు వివరాలను వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన షేక్ సమీర్ (22), గోల్కొండ ప్రాంతానికి చెందిన మహమ్మద్ హుస్సేన్ (19) లు స్నేహితులు. జలసాలకు అలవాటు పడి సులభమైన మార్గంలో డబ్బు సంపాదించాలని చెడు దేశంతో దారి దోపిడికి పాల్పడుతున్నారు. ఈనెల 5న చింతల్ పద్మారావు నగర్ ఫేస్ టూ కు చెందిన సతీష్ పంజాగుట్ట ఎల్ఐసి కార్యాలయంలో విధులు ముగించుకొని తిరిగి ఇంటికి వెళుతున్న క్రమంలో బాలానగర్ నుండి చింతల వెళ్లే దారిలో ఉన్న ఉష ఫ్యాన్ కంపెనీ సమీపంలోకి రాగానే మహమ్మద్ హుస్సేన్, సమీర్ లు తన ద్విచక్ర వాహనాన్ని సతీష్ వెళ్లే ద్విచక్ర వాహనానికి తగిలించడంతో సతీష్ కింద పడిపోయాడు. సతీష్ దగ్గర ఉన్న రెండు సెల్ ఫోన్లు, రెండు తులాల బంగారు గొలుసును అతని దగ్గర నుండి లాక్కొని అక్కడి నుండి పారిపోయారు. ఈ మేరకు సతీష్ బాలానగర్



పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న బాలానగర్ పోలీసులు సిసి కెమెరాలు ఫుటేజ్ ఆధారంగా నిందితులను అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారణ చేపట్టగా వారు నేరాన్ని అంగీకరించారు. వారి వద్ద నుండి రెండు సెల్ ఫోన్లతో పాటు బంగారు గొలుసును స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్ కు తరలించారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ఈ కేసును చేదించిన బాలనగర్ పోలీసులను ఏసిపి హనుమంతరావు అభినందించారు.



## అక్రమంగా కట్టెలు రవాణ చేస్తున్న ట్రాక్టర్ సీజ్

కేటిదొడ్డి, డిసెంబర్ 19(ప్రభాత ఉదయం) అనుమతులు లేకుండా కట్టెలు తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గద్వాలకు చెందిన ఓ కట్టెల వ్యాపారి కేటిదొడ్డి మండలంలో అక్రమంగా కట్టెలు కొట్టి ట్రాక్టర్‌లో తరలిస్తుండగా గురువారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లు గుర్తించి పట్టుకున్నారు. కట్టెల రవాణకు సంబంధించి ఏమైనా అనుమతులు ఉన్నాయా? అని ఆరా తీయగా డ్రైవర్ లేవని చెప్పాడు. దీంతో ట్రాక్టర్‌ను గద్వాల అటవీశాఖ కార్యాలయానికి తరలించారు.

## భూభారతి వల్ల రైతులకు ప్రయోజనం:

### కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి

### భూభారతి ప్రకటన పట్ల హర్షం



కొత్త కోట, డిసెంబర్ 19(ప్రభాత ఉదయం) గత ప్రభుత్వం 2020లో తెచ్చిన ధరణ పోర్టల్ ను రద్దుచేసి కొత్తగా తెలంగాణ భూభారతి 2024 కొత్త చట్టం అమలు లోకి తేవడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని తీసుకురావడం పట్ల కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ఈరోజు ఒక చరిత్ర క మైన రోజు మనిషికి భూమికి వీడతీయరాని అనుబంధము ఉంది. భూమి ఉంటే ఆత్మగౌరవంతో బతికే అవకాశం ఇస్తుంది అని తెలియజేస్తున్నాను. ధరణి చట్టం వల్ల మూడేళ్లలో లక్షలాది సమస్యలు తీసుకొచ్చి అనేకమంది రైతుల సమస్యలను తీసుకొచ్చిందని తెలియజేస్తున్నాను. ధరణ పోర్టల్ సాఫ్ట్ వేర్‌లో చాలా అవకతవకలు జరిగి చాలామంది రైతులు భూములు కోల్పోయారని తెలియ జేస్తున్నాను. కొత్త చట్టంతో సామాన్య ప్రజలకు ఇబ్బంది ఉండకుండా కొత్త చట్టం తీసుకురావడం తప్పులు పునరావత్సం కాకుండా మేదవులతో చర్చించి ఈ చట్టం తేవడం పట్ల భూమికి పూర్తి భద్రత కల్పించడం జరుగుతుంది అని తెలియజేస్తున్నాను. ధరణ వల్ల 18 లక్షల 26 వేల ఎకరాలు పార్టు %బీ% లో ఉంది దిని వల్ల క్షేత్రస్థాయిలో ప్రజలు రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు ప్రజలకు సులువుగా ఉండే భూభారతిని ప్రభుత్వం తేవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.